## క్లుప్తంగా

### భోళా శంకర జాతరలో నాయకులు



ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి: భీమారం మండలంలోని ఈదుల లింగంపేటలో జరుగుతున్న భోళా శంకర జాతరలో ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు విప్‌కు సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, పుప్పాల కొమురయ్య, వెంకటేశం తదితరలు ఉన్నారు.

**చల్మెడ ప్రత్యేక పూజలు**

భోళా శంకర జాతరలో బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఆయన వెంట జెడ్పీవైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, అంగడి ఆనందర్, కంచి శంకర్, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

### ముగిసిన వీపీఎల్ క్రికెట్ టోర్నీ



విన్నర్ ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి–వెంకట్రావ్‌పేటలో నిర్వహిస్తున్న వీవీరావుపేట ప్రీమియర్ లీగ్(వీపీఎల్) క్రికెట్ టోర్నీ శనివారం రాత్రి ముగిసింది. వీవీరావుపేట ప్రీమియర్ లీగ్(వీపీఎల్) కోసం ఫ్రాంచైజీలు జట్లను కొనుగోలు చేసి టోర్నమెంట్‌ను నిర్వహించగా, విన్నర్‌గా వీవీరావుపేట బుల్స్, రన్నరప్‌గా వీవీరావుపేట సోల్జర్స్, 3వ స్థానంలో వీవీరావుపేట ఈగల్స్, 4వ స్థానంలో వీవీరావుపేట కింగ్స్ జట్లకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బిట్ల సరోజన, జోగుల మమత, ఎంపీటీసీలు తోట సుజాత, గుగ్లావత్ భూమి, నాయకులుపాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి పరీక్షలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: జగిత్యాల పావని కంటి ఆస్పత్రి, ఆపి రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల నియోజకవర్గ, పరిసర ప్రాంతాలకు చెందిన 19 మందికి ఎమ్మెల్యే ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. చికిత్స చేయించుకున్న వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పావని ఆస్పత్రి వైద్యులు డా విజయ్‌కుమార్, నాయకులు ప్రభాకర్, బల్కం మల్లేష్, ఏనుగుల రాజు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### పెన్షనర్స్ వాయిస్ మాస పత్రిక ఆవిష్కరణ



మాస పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: పెన్షనర్స్‌కు గొంతుకగా వ్యవహరిస్తున్న పెన్షనర్స్ వాయిస్ మాస పత్రికను సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ అసోసియేషన్‌లో జరిగిన కార్యక్రమంలో హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ సంఘ సభ్యుల విజ్ఞప్తి మేరకు పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి పట్టబద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్‌కుమార్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షుడు పీసీ హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ మోటార్ చోరీ

జగిత్యాలక్రైం: పట్టణ శివారులోని లింగంపేట గ్రామానికి చెందిన దొంగ ధర్మరాజుకు చెందిన విద్యుత్ మోటారును గుర్తుతెలియని దొంగలు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. లింగంపేటకు చెందిన ధర్మరాజు రైల్వేస్టేషన్ ముందు ఉన్న తన వ్యవసాయబావికి పెట్టుకున్న విద్యుత్ మోటార్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో భాదిత రైతు ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఆధ్యాత్మికం



తాండ్రియాల శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

### కనుల పండువగా శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం భక్త జన సందడిలో కనులపండువగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలందుకున్న స్వామివారు రథంపై ఆశీనులయ్యారు. రథోత్సవం ప్రధానవీధుల గుండా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికి పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, అర్చకులు సీతారామ చార్యులు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పంజాల మారుతి, తదితరులు పాల్గొన్నారు.



భూషణరావుపేటలో మల్లికార్జునస్వామి బోనాలు

### ఘనంగా మల్లికార్జునస్వామి బోనాల జాతర

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మల్లికార్జునస్వామి బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం భక్తులు బోనాలతో ఆలయానికి చేరుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, యాదవసంఘం సభ్యులు పాల్గొన్నారు.



రాయికల్‌లో భీమేశ్వర స్వామి కల్యాణం

### వైభవంగా భీమేశ్వరస్వామి కల్యాణం

రాయికల్: పట్టణంలోని భీమన్న ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి భీమేశ్వరస్వామి–ద్రౌపది కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు రమేశ్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోత్సవాల మధ్య కల్యాణం నిర్వహించగా, రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణం తిలకించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం స్వామివారిని దర్శనం కోసం భక్తులు బారులుతీరారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నిర్వాహకులు, భీమన్న యువజన సంఘం సభ్యులు,అన్నదాన సేవా సమితి సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

# ఈ పాపం ఎవరిది..?

- అప్పు చేసి ఇళ్లు కట్టుకున్న పేదలు
- కూల్చివేతతో అయోమయం
- ఏడాదిగా అధికారుల ఉపేక్ష



అధికారులు కూల్చిన ఇళ్లు

కోరుట్ల: 'నాన్న లేడు.. అమ్మ బీడీలు చుట్టి నా పెళ్లి చేసింది.. నేను బట్టల దుకాణంలో పనిచేస్తున్న.. నా భర్త రోజువారి పని చేసుకుంటాడు.. ఇల్లు జాగాలేదు. కోరుట్లలో కిరాయి ఉంటున్నం.. జంబి గద్దెవద్ద ప్రభుత్వం జాగలు ఇస్తున్నారని తెలిసి వెళ్లిన. సీపీఎం వాళ్లు నాకో జాగ చూపించారు. హద్దులు పెట్టి పోతే జాగ దక్కదని బంగారం అమ్మి.. బంధువుల దగ్గర అప్పు చేసి రూ.70వేలు పెట్టి ఇల్లు కడుతున్న.. ఇంతలో సార్లు వచ్చి కూలగొట్టింద్రు. ఇప్పుడు ఇల్లు లేదు. బంగారం లేదు. అప్పు మిగిలింది..' ఓ నిరుపేద మహిళ ఆవేదన ఇది.

**నిరాశ మిగిల్చిన భూపోరాటం**

భూమిలేని వారికి లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన భూపోరాటం కోరుట్ల, జగిత్యాల పరిసరాల్లో నిరుపేదల్లో నిరాశను మిగిల్చింది. భూ పోరాటంతో ప్రభుత్వ స్థలం దక్కుతుందన్న ఆశతో అప్పు చేసి తిప్పలు పడి పందిళ్లతో టెంట్లు, రేకుల షెడ్లు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన నిరుపేదలు.. చివరకు అధికారులు వాటిని కూల్చివేయడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. చేతి నిండా పనిలేకున్నా, చిల్లిగవ్వ చేతిలో లేకున్నా, రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. కూల్చివేతలో దయనీయ స్థితికి చేరిన పేదల దుస్థితికి కారణం ఎవరన్న అంశం చర్చనీయంగా మారింది.

**అవగాహన లోపం..**

ప్రభుత్వ స్థలాల్లో నిబంధనల ప్రకారమే నిరుపేదలకు ఇళ్ల కేటాయింపు ఉంటుందన్న అంశంపై అవగాహన లేని నిరుపేదల ఆతృత సీపీఎం భూపోరాటానికి పునాదులు వేసింది. పేదల ఆశను నిజం చేయాలని సంకల్పంతో కోరుట్లలోని జంబి గద్దెల సమీపంలో ఉన్న 926 సర్వే నంబరులోని సుమారు 40 ఎకరాలు, జగిత్యాలలోని నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని సీపీఎం నేతలు ఎంచుకున్నారు. నిరుపేదలను సంఘటిత పరిచి ఇళ్లస్థలాలు ఇప్పిస్తామని చెప్పి 80 గజాల నుంచి 120 గజాలకు ఓ ప్లాటు చొప్పున హద్దులు ఏర్పాటు చేయించారు. ఇది సుమారు ఏడాది కాలంగా కొనసాగింది. అయితే నిరుపేదలు చాలామంది అక్కడికి చేరుకుని తమకూ లబ్ధి చేకూర్చాలని కోరి 800 మందికి మించి ఆ స్థలంలో హద్దులు పెట్టుకున్నారు. జగిత్యాల నర్సింగాపూర్‌లోనూ దాదాపు 500 మంది ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నారు. అధికార యంత్రాంగం ప్రభుత్వ స్థలం ఆక్రమించుకోవడం సరికాదని అప్పుడప్పుడు చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. భూపోరాటానికి సారథ్యం వహిస్తున్న నేతలపై కేసులు నమోదు చేసినా ఫలితం దక్కలేదు. ఇలా సుమారు ఏడాది కాలం గడిచిపోయింది.

**ఓట్లపై నేతల ఆపేక్ష..**

డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రాజకీయ నాయకులు దూరదృష్టితో వ్యవహరించారు. సీపీఎం భూపోరాటంలో ప్రభుత్వ స్థలాలకు హద్దులు పెట్టుకుని ఇళ్ల నిర్మాణానికి సన్నాహాలు చేసుకుంటున్న నిరుపేదలను ఇబ్బంది పెడితే తమకు నష్టం జరుగుతుందన్న యోచనతో అంటిముట్టనట్లు వ్యవహరించారు. ఓ దశలో జంబి గద్దె ప్రభుత్వ స్థలాల్లో కబ్జాలో ఉన్నవారితో పాటు, జగిత్యాల నర్సింగాపూర్‌లో గుడిసెలు వేసుకున్న వారు అర్హులు అయితే వారికి ప్రభుత్వ పరంగా నివేశన స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అక్కడే సీపీఎం నాయకులు తమ పట్టును మరింత బిగించారు. ఇలానే కోరుట్లలోని జంబి గద్దె స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పేదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే జంబి గద్దె వద్ద ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి.

**అధికారుల ఉపేక్ష..**

ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్న అంశం అధికారుల దృష్టికి వచ్చినా ఎన్నికల సమయం కావడంతో తీరిక లేక పట్టించుకోకుండా ఉపేక్ష వహించారు. దీనికి రాజకీయ నేతల ఒత్తిళ్లు తోడైనట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కోరుట్ల, జగిత్యాలలో ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన గుడిసెలతోపాటు ఇళ్ల నిర్మాణాలను తొలగించారు. దీంతో అప్పు చేసి గుడిసెలు వేసుకున్న పేదలు నిరాశ్రయులుగా మారారు. అధికారులు ఆదిలోనే ఈ చర్య తీసుకుని ఉంటే పేదలు ఇండ్ల నిర్మాణం కోసం వెచ్చించిన డబ్బులు వృథా కాకపోయేవన్న వాదనలు వినవస్తున్నాయి. ప్రభుత్వ స్థలాల కేటాయింపులో పైరవీలకు, రాజకీయ జోక్యానికి సంబంధం లేకుండా నిబంధనల ప్రకారం నిరుపేదలను ఆదుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఘనంగా మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఘనంగా రేణుకాఎల్లమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న గౌడ సంఘ నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేటలో రేణుకా ఎల్లమ్మకు ఆదివారం బోనాలు చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలను ఊరేగింపుగా తీసుక వెళ్లి రేణుకా ఎల్లమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు.

### నృసింహుడిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



ప్రభుత్వ విప్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామినిని ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం పక్షాన సాంప్రదాయ రీతుల్లో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంద ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపి స్వామివార్లను దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రం కప్పి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.కార్యక్రమంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

**ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వద్దు**

ఆరోగ్య విషయంలో ఎవ్వరూ నిర్లక్ష్యం చేయవద్దని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అపెక్స్ ఆస్పత్రి సహకారంతో పట్టణానికి చెందిన చీపిరిశెట్టి రాజేష్, కాశెట్టివాడ మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉన్న మా దృష్టికి తీసుకురావాలని అందే కాకుండా ఆరోగ్యం విషయంలో పార్టీలకతీతంగా కలిసి పని చేస్తామని అన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాశెట్టివాడ మిత్రబృందం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ఆరు గ్యారంటీలతో పేదల అభ్యున్నతి కృషి



సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న కృష్ణారావు

మల్లాపూర్: ప్రజాప్రభుత్వంలో ఆరు గ్యారంటీలను అమలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని వేంపల్లిలో అభివృద్ధి పనులకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో పక్కాగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో మరోసారి ఇందిరమ్మ రాజ్యం రాబోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతు గోపి, తదితరులు పాల్గొన్నారు.

### వాలీబాల్ టోర్నీ విజేత ధర్మాజీపేట



విజేతగా నిలిచిన ధర్మాజీపేట టీం సభ్యులు

రాయికల్: పట్టణంలో భీమన్న జాతర సందర్భంగా మండల క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. విన్నర్‌గా ధర్మాజీపేట,రన్నర్‌గా వస్తాపూర్ జట్లు నిలిచిన్నట్లు క్లబ్ కార్యదర్శి కుర్మ సుదర్శన్‌రెడ్డి, పీఈటీ బందెల శ్రీనివాస్ తెలిపారు.

**టోర్నీ విజేతగా ఊట్‌పెల్లి**

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో చిలివేరి సాయబ్ అనే యువకుడి స్మారకార్థం నిర్వహించిన ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నీ విజేతగా ఊట్‌పెల్లి జట్టు నిలిచింది. ఆదివారం ఉదయం ఈ టోర్నీ ప్రారంభించగా.. వివిధ గ్రామాలకు చెందిన 18 జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఊట్‌పెల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గడ్డం భూమారెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ గడ్డం దివాకర్ రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ అంబటి రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ప్రజాప్రభుత్వంతోనే గ్రామాల్లో వేగంగా అభివృద్ధి**

మల్లాపూర్: ప్రజాప్రభుత్వంతోనే గ్రామాల్లో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యహరించారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గానికి కోట్లాది నిధులు మంజూరు చేశారన్నారు. కోరుట్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలకు రూ.15కోట్ల నిధులను కేటాయించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపెల్లి రామాగౌడ్, ప్యాక్స్ చైర్మన్ క్యాతం మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా మోటూరు రాజు**

కోరుట్ల: పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మోటూరు రాజు ఎన్నికయ్యాడు. పట్టణంలోని వాసవి కన్యకా భవనంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో 980 ఓట్లు పోల్ కాగా తన ప్రత్యర్థి బచ్చు శ్రీనివాస్‌పై 106 ఓట్ల ఆధిక్యంతో మోటూరు రాజు విజయం సాధించాడు. ఈ సందర్భంగా రాజును పలువురు ఆర్య వైశ్య సంఘ నాయకులు అభినందించారు.

**నూతన నియామకం**

మెట్‌పల్లిరూరల్: బీసీ సంక్షేమ సంఘం కోరుట్ల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పోతు సత్యనారాయణ నియామకమయ్యారు.ఈ మేరకు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు పలువురు అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజు,శేఖర్, నాగరాజు,సురేశ్ పాల్గొన్నారు.

**గంగారాం ఆశయ సాధనకు కృషి**

కోరుట్ల: కమ్యూనిస్టు నాయకుడు, కార్మిక సంఘ నేత కడకుంట్ల గంగారాం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ నాయకులు అన్నారు. ఈ మేరకు కడకుంట్ల గంగారాం 32 వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీ ప్రభాకర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గంగారాం బీడీ పరిశ్రమలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ నేత సీ ప్రభాకర్‌తో కలిసి పోరాటం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుతారి రాములు, నాయకులు హొటారికారి శ్రీనివాస్, ఎన్నం రాధ, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంలోని టౌన్–1 పరిధిలో రాంబజార్, పురాణిపేట, కరీంనగర్ రోడ్డు, గణేశ్ టెంపుల్ ఏరియా, బైపాస్ రోడ్డు, అంగడి బజార్, యావర్ రోడ్డు, మార్కెట్ వెనుక సైడ్, కృష్ణానగర్, అరవింద్‌నగర్, మార్కెట్ వెనుక సైడ్, టాకా సంది, సాయిరాంనగర్, గోవిందుపల్లి, శ్రీరాంనగర్, వెంకటాద్రినగర్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ అశోక్ రెడ్డి తెలిపారు.

### లలితాంబిక విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

రాయికల్: పట్టణంలోని లలితాంబిక విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ గ్రామ ప్రదక్షిణ, గ్రామ దేవత ప్రార్థన, విఘ్నేశ్వర పూజ కార్యక్రమాలు రామకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు.భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

### విజయ సంకల్పయాత్రకు తరలిరావాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

మెట్‌పల్లిరూరల్: జగిత్యాల జిల్లాలో నేడు జరిగే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ అన్నారు. మెట్‌పల్లిలోని వాసవి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సోమవారం సాయంత్రం సంకల్ప యాత్ర మెట్‌పల్లికి చేరుకుంటుందన్నారు. దేశంలో మోదీ నాయకత్వాన్ని మరింతా బలపరించేందుకు ఔర్ ఏక్ బార్ మోడీ సర్కార్ నినాదంతో ముందుకెళ్లాలన్నారు. పదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ ప్రభారి వెంకటరమణ,విస్తారక్ రాంప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరిబాబు, పట్టణ అధ్యక్షుడు రమేశ్,నాయకులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడి సస్పెన్షన్

మెట్‌పల్లిరూరల్: మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పన్నాల మాధవరెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆదివారం మెట్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో మాధవరెడ్డి బీఆర్ఎస్‌లో ఉంటూ పార్టీలోని అంతర్గత విషయాలను కాంగ్రెస్ నేతలకు చేర వేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయంపై జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు పలుమార్లు మందలించినప్పటికీ మార్పురాలేదన్నారు. కాంగ్రెస్‌కు కోవర్టుగా పనిచేసిన మాధవరెడ్డి బీఆర్ఎస్ పార్టీ వల్ల వచ్చిన కోఆప్షన్ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే మాధవరెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తపై చేసిన నిరాధారణమైన ఆరోపణలను రుజువు చేయాలన్నారు.లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు మొరపు గంగాధర్,అంగడి పురుషోత్తం,లంక గంగాధర్,నాయకులు మార్గం హన్మాండ్లు,రాజారాం,శ్రీనివాస్,జియా తదితరులు పాల్గొన్నారు.

### మానస ఎక్సలెన్స్‌లో ఆకట్టుకున్న ఉత్సాహ్ 24



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని జ్యోతి ఐఐటీ అకాడమీ హార్ట్‌బీట్స్2కె24, మానస ఎక్సలెన్స్‌లో ఉత్సాహ్24పేరిట ఆదివారం నిర్వహించిన పదో తరగతి వీడ్కోలు వేడుకలు విద్యార్థుల్లో జోష్ నింపాయి. విద్యార్థుల ఆటాపాటా ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి, మండల విద్యాదికారి గాయత్రి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి శ్రీధర్‌రావు, ప్రముఖ రచయిత్రి అనిత, డైరెక్టర్లు హరిచరణ్‌రావు, రజితారావు, పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ పాల్గొన్నారు.